శవాలు కాలగా వస్తున్న కమురు కంపు ..... ఆకాశానికి లేస్తున్న పొగ సుడులు తిరుగుతూ భేతాళుడే ఆ ప్రదేశాన్ని ఆవహించాడా అనిపిస్తోంది.

అదే సమయంలో ఆరడుగుల పైనున్న ఆకారం అక్కడికి చేరుకుంది. చితులు కాలగా వెలుగు నిండిన ఆ ప్రదేశం అతన్ని చూసి జడిసినట్లు ఒక్కక్షణం కంపించింది.

దెయ్యాలు ఏడుస్తున్నట్లు గాలిలోంచి స్ ..... స్స్ ..... స్స్ ..... స్స మనే గోల. సమాధుల వెనగ్గా నక్కి నక్కి చూస్తోంది నక్క.

అతడు చితుల వెలుగులో అక్కడి నేలని వెదుకుతూ అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

గాలిలో ప్రారంభమయిన కలకలం.

'క్షీ౧త్యేర్థి నిహ్వదే కృత్యేర్థీ విహ్వదే' అంటూ గట్టిగా అరిచాడు. మరుక్షణం కలకలం ఆగిపోయింది. అతడు వెదుకుతూనే వున్నాడు.

'టప్'మని చినుకుపడింది. అతడు తలెత్తి ఆకాశం కేసి చూశాడు. నల్లని మేఘాలు! గుంపులు గుంపులుగా. మళ్ళీ వెదుకులాట మొదలుపెట్టాడు.

'టప్' మరింత పెద్దగా పడింది చినుకు. ఎవరో గురిచూసి కొట్టిన రాయిలా.

గాలి మళ్ళీ ఉధృతం కాసాగింది. దక్షిణం వైపునుంచి క్షణక్షణానికీ పెరుగుతున్న రోదన ..... గుండెలవిసిపోయి ప్రాణాన్ని కడగట్టించేసేంత భీతావహంగా!

అతడి కళ్ళు శోధిస్తూనే వున్నాయ్ .....

మరికొంచెం ముందుకు నడిచిన తర్వాత కావలసింది దొరికినట్టు ముందుకి వంగేడతను.

మళ్ళీ పెద్దగా చినుకుపడింది. అదే సమయంలో అతను నేలని పెళ్ళగించసాగాడు!

అప్పుడు సమయం అర్థరాత్రి పన్నెండయింది.

*           *           *           *           *

మహదేవ్ పరిస్థితి పూర్తిగా క్షీణించిపోయింది. ఎముకల గూడులా అయిపోయింది అతని శరీరం. రబ్బర్ మాస్క్‌ద్వారా ఆక్సిజన్ కృత్రిమంగా అందుకుంటూ మృత్యువుతో పోరాడుతున్నాడు.

డాక్టర్ బ్లడ్ రిపోర్ట్ పరీక్షగా చూస్తున్నాడు. రోగం ఇదమిద్దంగా తేలటం లేదు. బ్లడ్‌లో హిమోగ్లోబిన్ మాత్రం డెసిలీటర్‌కు నాలుగు గ్రాములకి తగ్గిపోయింది. అతను గబగబా 'ఎరిత్రో పాయటిన్' ఇంజక్షన్ అతని కిచ్చాడు. ఎరిత్రోపాయటిన్‌కి రక్తంలోని ఎర్రరక్తకణాలని పెంచే గుణముంటుంది.

కానీ చాల నెమ్మదిగా జరుగుతుందీ కార్యక్రమం. దానికి వారం పట్టచ్చు. రెండు వారాలు పట్టొచ్చు. అంతవరకూ పేషెంట్ బ్రతికి వుంటాడా లేదా అన్నదే ఇప్పుడు సమస్య.

డాక్టర్‌కి బుర్ర చించుకున్నా మహదేవ్ జబ్బేమిటో అర్థంకావటం లేదు. మెల్లగా నడిచి

ఒక్కక్షణం అతని వంక చూశాడు. రక్తం బాగా తగ్గిపోయినట్టు తెల్లని పిండిబొమ్మలా కనిపిస్తున్నాడతను.

మౌనంగా డాక్టర్ బయటికి నడిచాడు.

అక్కడ వరండాలో అభిరాం, తిరుపతి, మనస్విని కనిపించారు అతనికి. ఎవరూ ఏమీ అడగలేదు అతన్ని. గిల్టీగా ఫీలయి అతనే అన్నాడు.

"ఏం ఫర్వాలేదు. క్రమంగా తగ్గిపోతుంది" తన మాటలు తనకే కొత్తగా, వింతగా విన్పించాయి. కంఠం వణికినట్టు కూడా అన్పించింది. వేగంగా నడుస్తూ ముందుకు సాగిపోయాడు.

*  *  *  *  *

తిరుపతి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. వరప్రసాదం ఏమయిపోయాడు. అప్పటిదాకా అందరితో కలసి వున్న మనిషి ఆఖరి క్షణంలో ఎందుకు చెప్పాచెయ్యకుండా నిష్క్రమించాడు?

మహదేవ్ శరీరం శిథిలమైపోయింది. మహా అయితే ఇంకో ఇరవై నాలుగుగంటలే అతనికీ భూమ్మీద మిగిలి వుంది ఆయుష్షు. తర్వాత అతని ప్రాణం అనంతవిశ్వం వైపు దూసుకుపోతుంది.

తను అనవసరంగా ఆగిపోయాడేమో! వీళ్ళ బాధలని చూస్తూ నవ్వే మరిచిపోయాడు. లోకంలో ఎవరికైనా యిన్ని బాధలుంటాయా?

ఉంటాయి. ఉన్నాయి ..... తన ఎదురుగా కనిపిస్తున్న దృష్టాంతాలే అందుకు నిదర్శనం. క్షణక్షణం బొమ్మలా శిథిలమవుతూ తన వాళ్ళని దు:ఖంలోకి నెట్టేస్తున్న మహదేవ్ పడుతున్నది శారీరకమైన బాధయితే ..... అభిరాం, మనస్వినిలు పడుతుంది మానసికమైనది .....

అతి చిన్న వయస్సుల్లో వాళ్ళకి రావలసిన బాధలు కావివి. ఎంతో జీవితాన్ని చూసేసిన వారికి ..... వారు కూడా చూడలేరు. వారు కూడా తట్టుకోలేరు ఇంతటి భయానకమైన సత్యాల్ని. అసలు మానవమాత్రులెవరూ సహించలేని బాధలివి.

నిరాటంకంగా సాగే అతని ఆలోచనలని చెదరగొడుతూ హాస్పటల్ గడియారం ఠంగుఠంగుమంటూ పన్నెండుసార్లు మోగింది.

డాక్టర్ హడావుడిగా నడిచాడు చీఫ్ గదిలోకి.

"రండి డాక్టర్!" అతన్ని చూడగానే సాదరంగా ఆహ్వానించాడు చీఫ్.

"ఇంత సడన్‌గా పిలిచారు" అర్థంకాకపోవటంతో సాందిగ్ధంగా అడిగాడు డాక్టర్.

"మహదేవ్ జబ్బేమిటో డయాగ్నైజ్ చేశారా?"

ఆ మాటలు విని ఏం చెప్పలేక మౌనంగా తల దించుకున్నాడు డాక్టర్.

"బాధపడకండి డాక్టర్" అన్నాడు చీఫ్.

మౌనంగా తలూపాడతను.

"మీకు చిన్న ..... చిన్నేమిటి పెద్దదే ..... మీకో పెద్ద గుడ్‌న్యూస్" అన్నాడు చీఫ్.

"ఏమిటి?" అడిగాడు డాక్టర్.

"మహదేవ్ శరీరంలో వున్న జబ్బేమిటో ఇట్టే చెప్పేసే పరికరం బ్రిటన్ నుంచి రేపే రాబోతుంది మనకి" అన్నాడు చీఫ్.

" ..... ..... ....."

"మాట్లాడరేమిటి? బ్రిటన్ నుంచి రాబోయే ఆ పరికరం 'ఫోటోగ్రాఫ్ సిస్టమ్.'"

అతనికా పరికరం పనిచేసే విధానం, ఆ సిస్టమ్ ముందే తెలుసు.

వివిధ వ్యాధులను నిర్ధారణ చేసేందుకు రూపొందించిన ఆ వినూత్న విధానానికి ప్రొటీన్లే మూలం. ముందుగా రోగి శరీరంలోని ఒక కణజాలాన్ని ఆరోగ్యవంతునిలోని మరో కణజాలాన్ని సేకరించి వీటిని 'ఫోటోగ్రాఫ్' సిస్టమ్‌లోని అడుగుభాగంలో ఒక ప్రత్యేకమైన జిగురు పదార్థం కప్పి వున్న రెండు వేరు వేరు పలకమీద జారే విధంగా వుంచుతారు.

ఈ ప్రొటీన్లు విభిన్నమైన విద్యుదావేశాలనూ, బరువులను కలిగి వుండటంవల్ల కణజాలం నుంచి విడివడి దూరంగా అమరుతాయి. అప్పుడీ పలకంపై వుండే ప్రోటీన్ల అమరిక చీకటివేళ ఆకాశంలో వుండే నక్షత్రాల మాదిరి కనిపిస్తాయి.

ఆ తర్వాత ఫోటోగ్రాఫ్ పరికరంలోని కంప్యూటర్ పలకంపై అమరిన సమాన లక్షణాలను కలిగిన ప్రోటీన్లను వేరుచేసి చూపిస్తుంది. దీంతో రోగకారకమైన ప్రోటీన్ వైద్యుడికి లభిస్తుంది. దాన్నే 'ప్రోటోమ్' గా వ్యవహరిస్తారు. ప్రోటీన్, జీనోమ్‌ల (క్రోమోజోమ్‌ల మొత్తం సముదాయం) సమ్మేళనమే ప్రోటీన్ల పని తీరును నిర్ణయిస్తాయి.

దీంతో రోగనిర్ధారణకి అట్టే సమయం పట్టదు. వ్యాధి నిర్ధారణ వేగాన్ని పెంచడం ద్వారా చికిత్స వేగాన్ని కూడా పెంచడానికి అవకాశమిచ్చే గొప్ప ప్రక్రియగా వైద్యులందరూ మెచ్చుకుంటున్నారు.

"ఏమిటి మాట్లాడరు?"

"నథింగ్ చీఫ్."

"మహదేవ్ మిమ్మల్ని బాగా కదిలించాడనుకుంటున్నాను" అని అన్నాడాయన.

అవునూ, కాదన్నట్టు తలూపి వూరుకున్నాడతను.

"రేపు మధ్యాహ్నానికి మనకా పరికరం వచ్చేస్తుంది. అది వచ్చిన వెంటనే మహదేవ్ జబ్బేమిటో తెలుసుకుంటాం. అతనే దాన్ని వుపయోగించుకున్న మొట్టమొదటి ఇండియన్‌గా చరిత్రకెక్కుతాడు .....

ఎందుకంటే ఈ సిస్టమ్ తీసుకుంటుంది మొదటిగా ఇండియాలో మనమే. రెండు ఘనతలూ ఆంధ్రాకే వస్తాయి. 'ఫోటో సిస్టమ్' కలిగివున్న హాస్పిటల్‌గానూ, ఫోటోసిస్టమ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయించుకున్న ఆంధ్రుడిగా అతని పేరూను" చిన్నగా నవ్వుతూ అన్నాడు చీఫ్.

మౌనంగా తలూపాడు డాక్టర్.

"ఇప్పుడెలా వుంది మహదేవ్ పరిస్థితి?"

"మునుపటిలానే ..... రోగమేమిటో తెలియకుండా!"

"డోంట్‌వర్రీ ..... రేపు సాయంత్రానికి అన్నీ తెలిసిపోతాయి. ఆ వెంటనే ట్రీట్‌మెంట్ యిచ్చేస్తాం."

'అంతవరకూ అతను బతికివుండాలిగా' మనసులోనే అనుకున్నాడు డాక్టర్.

* * * * *

సాయంత్రం ఆరయింది సమయం!

అభిరాం మెల్లగా నడుస్తూ మహదేవ్ వైపు చూశాడు.

ఏ కదలికా లేదు అతనిలో. 'ప్రాణం వుందా? పోయిందా?' ఒక్క క్షణం తన ఆలోచనలకి తనకే గుండె జలదరించింది.

నుదుటిమీద చెయ్యేసి చూశాడు. వెచ్చదనాన్ని అప్పుడే కోల్పోతున్నట్టు క్షణక్షణానికి చల్లబడసాగింది.

అతనికెందుకో "ఈ రోజు విపరీతమేదో జరగబోతోంది" అనిపించింది. మనస్విని వైపు చూశాడతను.

శూన్యంలోకి చూస్తున్న నిస్తేజమయిన చూపులు. చాలా కోపమొచ్చింది ఆమెపై! "ఇంటికి వెళ్ళమంటే వెళ్ళదు ..... ఏమైపోదామని? ఆత్మత్యాగం చేస్తుందా మహదేవ్‌తోపాటు" అనుకున్నాడు.

అసహనంగా, చిరాగ్గా వుందతనికి. అందరిమీదా కోపం ..... తనమీద కూడా! మహదేవ్‌ని బతికించుకోవడమెలాగో తెలియక, ఏం చెయ్యాలో తోచక అతని మనసు అలజడికి లోనై అతడు తనమీద తానే అదుపు కోల్పోతున్నాడు.

తిరుపతి కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు. "సమయం అయిపోవస్తోంది- మరి కొన్ని గంటలు మాత్రమే!" అనుకున్నాడతను.

అదే సమయంలో ఆ గదికి వచ్చాడు డాక్టర్. మహదేవ్ శరీరం క్రమంగా చల్లబడటం గమనించాడు. స్టెతస్కోపుతో హార్ట్‌బీట్ విన్నాడు.

లబ్ ..... డబ్ ..... లబ్ ..... డబ్ ..... ఏ క్షణం ఆగిపోతోందో తెలియనట్లు కొట్టుకుంటోంది అతని గుండె.

అదే సమయంలో లాబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ చేతిలో బ్రిటన్‌నుంచి వచ్చిన సరికొత్త రోగనిర్ధారణా యంత్రం ఫోటోగ్రాఫ్ సిస్టమ్‌లో తెలుసుకున్న మహదేవ్ శరీరంలోపాన్ని రిపోర్ట్‌లో సూచిస్తూ అందించాడు.

డాక్టర్ కళ్ళు వేగంగా చదివాయి ఆ రిపోర్ట్‌ని ..... 'మమో కార్డియల్ ఇన్‌ఫార్క్షన్' (కరోనరీ ధమని మూసుకుపోయి ఈ ధమని ద్వారా రక్తాన్ని పొందే గుండెభాగం చనిపోవటం

లేదా పనిచేయకుండా అయిపోవటం)

"ఎందుకు వచ్చింది ఈ వ్యాధి?" తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టింది అతని మెదడు.

*    *    *    *    *

సంధ్యాకాంతుల్ని విరజిమ్ముతున్న సాయం సమయం రాక్షసుడ్ని చూసి పరుగు లంకించుకున్న పాపాయిలా హఠాత్తుగా మటుమాయమై పోయింది. వెలుగుల్ని మింగానన్న గర్వంతో వికటాట్టహాసంచేస్తూ చీకటి నలుదిక్కులా స్వైర్యవిహారం చేస్తోంది.

పిల్ల తెమ్మెర పూలతో గుసగుసలు మానేసి, వేగంగా వెనుదిరిగి పోయింది. అదే సమయంలో సుడులు తిరుగుతున్న హోరుగాలి ఆ ప్రదేశానికి చేరుకుని దుమ్మూ, ధూళి, చెత్తా, చెదారం కలగాపులగంగా అయిపోయి తెరలా కప్పేసి కనులముందేముందో కనిపించనివ్వటంలేదు.

ముందురోజు నేలని పెకలించి బయటకి తీసిన బొమ్మని చేత్తో పట్టుకుని అక్కడికి చేరుకుందో ఆకారం.

గాలిని ఆసరా చేసుకుని భగ్గుమని ఆకాశానికి ఎగురుతూ మండుతున్న చితి, చీకటిని పారద్రోలటానికి బేతాళుడు వేసుకున్న నెగడులా వుంది. ఆ కాంతిలో - అక్కడికి చేరుకున్న ఆకారం ఎర్రటి కళ్ళు రక్తాన్ని అద్దుకున్న భ్రమని కలిగిస్తున్నాయి.

నేలలోంచి పొడుచుకువచ్చిన ఎముకలు శత్రువు శరీరంలో దిగిన శరాఘాతాల్లా వున్నాయి.

అతడు హోమగుండం వెలిగించడానికి నిప్పుకోసం కాలుతున్న చితివైపు నడుస్తున్నాడు.....

అప్పుడే భయంకరంగా తీతువు అరిచింది ..... ఆకాశం ఉరిమింది!

కాలి కాలి వున్న శవం ఉన్మాదం వచ్చినట్లు చితిపై లేచి కూర్చుంది ..... అతడు ఆ చితిలోంచి సగం కాలిన చెక్కపేడు అందుకుని వెనుతిరిగాడు.

*    *    *    *    *

కాలం హుషారు పుంజుకుని శరవేగంతో దూసుకుపోతోంది. డాక్టర్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"మహదేవ్ వ్యాధి నిర్ధారణ అయింది. అది మమోకార్డియల్ ఇన్‌ఫార్కషన్.

కొలెస్ట్రాల్ ఎల్.డి.ఎల్. (లో డెన్సిటీ లిపోప్రోటీన్) మోతాదు మించిపోవటంవల్ల వచ్చిన వ్యాధి యిది. కొలెస్ట్రాల్ అనేది తెల్లగా వుండే మైనంవంటి పదార్థం. ఇది మనిషికి అత్యంత అవసరం. ఇది మానవుల, జంతువుల కణాల్లో కూడా వుంటుంది.